సాక్షి కర్నూలు

శుక్రవారం, 19, ఏప్రిల్, 2024



అలరించిన నృత్యప్రదర్శన

శ్రీశైలంటెంపుల్: ధర్మపథం కార్యక్రమంలో భాగంగా గురువారం నిత్యకళావేదికపై హైదరాబాద్‌కు చెందిన నటరాజ ఆర్ట్స్ అకాడమీ వారి నృత్యప్రదర్శన అలరించింది.



.. ప్రగతికి బాటలు

వాటర్‌షెడ్‌లు గ్రామీణాభివృద్ధికి బాటలు వేస్తున్నాయి. ఉమ్మడి కర్నూలు జిల్లాలో రూ. 74.88 కోట్లతో వాటర్‌షెడ్ కార్యక్రమాలను జిల్లా నీటి యాజమాన్య సంస్థ నిర్వహిస్తోంది. 8లో▸



అతివేగానికి ఇద్దరు బలి

ప్రైవేట్ ట్రావెల్ బస్సు కల్వర్టును ఢీ కొనడంతో ఇద్దరు మృత్యువాత పడ్డారు. గురువారం తెల్లవారుజామున పూడిచెర్ల బస్సు స్టేజ్ వద్ద ఈ ప్రమాదం చోటుచేసుకుంది. 8లో▸

న్యూస్‌రీల్

ఖర్చుల వివరాలు పక్కాగా నమోదు చేయాలి

- వ్యయ పరిశీలకులు ఆరిందం ముఖోపాధ్యాయ



అరిందం ముఖోపాధ్యాయతో మాట్లాడుతున్న ఆర్‌ఓ భార్గవ్‌తేజ

కర్నూలు (టౌన్): ఎన్నికల సంఘం నిర్దేశించిన రేట్ల ప్రకారం అభ్యర్థుల ఖర్చుల వివరాలను పక్కాగా నమోదు చేయాలని కర్నూలు, పాణ్యం, కోడుమూరు, పత్తికొండ నియోజకవర్గాల వ్యయ పరిశీలకులు ఆరిందం ముఖోపాధ్యాయ అన్నారు. గురువారం కర్నూలు నగరపాలక సంస్థ కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి భార్గవ్‌తేజతో కలిసి ఎన్స్కోర్ విభాగం, సహాయ ఎన్నికల వ్యయ పరిశీలకుల విభాగం, అకౌంటింగ్, ఎస్‌ఎస్‌టీ ఫ్లయింగ్ స్క్వాడ్, వీడియో సర్వేలెన్స్, వీడియోగ్రఫీ విభాగాల రికార్డులను పరిశీలించారు. వివరాలను రిటర్నింగ్ అధికారిని అడిగి తెలుసుకున్నారు.

క్వింటా కందులు రూ.11,309

కర్నూలు(అగ్రికల్చర్): కందుల ధర జోరుమీద ఉంది. రోజురోజుకు ధర పురోగమనంలో ఉండటం రైతులకు ఆనందాన్ని కలిగిస్తోంది. గురువారం కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డుకు 27 మంది రైతులు 116 క్వింటాళ్ల కందులు తీసుకొచ్చారు. కందుల కొనుగోలుకు వ్యాపారులు పోటీ పడ్డారు. కనిష్ట ధర రూ.2,056, గరిష్ట ధర రూ.11,309 లభించింది. కందుల సగటు ధర కూడా రూ.11,309 నమోదైంది. అన్ని లాట్లకు ధర రూ.11 వేలపైనే లభించడం విశేషం. వాము 148 క్వింటాళ్లు రాగా కనిష్ట ధర రూ.5,318, గరిష్ట ధర రూ.19,599, సగటు ధర రూ.16,888 పలికింది.

అగ్నిప్రమాదాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

కర్నూలు: అగ్నిప్రమాదాల నివారణపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా ఐదవ రోజు పారిశ్రామిక వాడలు, పెట్రోల్ బంకుల్లో సంభవించే అగ్నిప్రమాదాలపై అగ్నిమాపక సిబ్బంది గురువారం జిల్లా వ్యాప్తంగా ప్రదర్శనలు నిర్వహించారు. ఇందులో భాగంగా జిల్లా అగ్నిమాపక సహాయ అధికారి చిన్నబజారి ఆధ్వర్యంలో కర్నూలు శివారులోని ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో ఉన్న దామోదర్ ఆయిల్ మిల్స్ దగ్గరకు వెళ్లి ప్రమాదాలు జరిగినప్పుడు వాటిని ఎలా నివారించాలి అనే అంశంపై డెమో(ప్రదర్శన) చేసి చూపించారు. అలాగే కల్లూరులోని ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంకు దగ్గర పెట్రోల్ బంకుల్లో అగ్నిప్రమాదాలు జరగకుండా తీసుకోవలసిన జాగ్రత్తలు, నివారణ చర్యల గురించి సిబ్బందికి తగిన సూచనలు చేశారు. అగ్నిమాపక శాఖ సిబ్బంది రంగస్వామి, బాలాజీ నాయక్, సోము నాయక్, సుధాకర్, మహేశ్వర్ నాయుడుతో పాటు దామోదర్ ఆయిల్ మిల్, పెట్రోల్ బంకు సిబ్బంది పాల్గొన్నారు.

మొదటి రోజు.. నామినేషన్ల జోరు

- జిల్లాలో 11 మంది 15 సెట్ల నామినేషన్ల దాఖలు
- ఎమ్మిగనూరులో నామినేషన్ వేసిన బుట్టారేణుక
- కోడుమూరులో ఆదిమూలపు సతీష్ తరఫున నామినేషన్ దాఖలు
- కర్నూలు పార్లమెంట్ స్థానం నుంచి నామినేషన్‌ను వేసిన టీడీపీ అభ్యర్థి, ఆయన భార్య



ఎమ్మిగనూరు వైఎస్‌ఆర్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా రిటర్నింగ్ అధికారికి నామినేషన్ అందజేస్తున్న బుట్టారేణుక, చిత్రంలో ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి, కర్నూలు ఎంపీ అభ్యర్థి బీవైరామయ్య తదితరులు



ఎమ్మిగనూరులో వేలాది మంది అభిమానుల మధ్య అభివాదం చేస్తూ నామినేషన్ వేసేందుకు వెళ్తున్న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టారేణుక



కర్నూలు ఆర్‌డీఓ కార్యాలయంలో కోడుమూరు వైఎస్‌ఆర్‌సీపీ అభ్యర్థి డాక్టర్ ఆదిమూలపు సతీష్ తరఫున నామినేషన్ వేస్తున్న ప్రతిపాదిత వ్యక్తి శివశంకర్

కర్నూలు(సెంట్రల్): సార్వత్రిక ఎన్నికల్లో అత్యంత కీలకమైన నామినేషన్ల ఘట్టం ప్రారంభమైంది. మొదటిరోజే కర్నూలు పార్లమెంట్ నియోజకవర్గంతోపాటు కర్నూలు, ఆదోని, కోడుమూరు, ఎమ్మిగనూరు అసెంబ్లీ నియోజకవర్గాలకు మొత్తం 11 మంది 15 సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. ఇందులో కర్నూలు పార్లమెంట్ బరిలో ముగ్గురు, కోడుమూరు అసెంబ్లీ బరిలో ఇద్దరు, ఆదోనిలో ఒకరు, ఎమ్మిగనూరులో ముగ్గురు, కర్నూలులో ఇద్దరు అభ్యర్థులు ఉన్నారు.

బుట్టా నామినేషన్

ప్రకటించిన షెడ్యూల్ మేరకు గురువారం ఉదయం 10.30 గంటల్లోపు ఎన్నికల సంఘం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఉదయం 11 గంటల నుంచి నామినేషన్ల స్వీకరణకు అధికారులు చర్యలు చేపట్టారు. ఎమ్మిగనూరులో వైఎస్‌ఆర్‌సీపీ అభ్యర్థిగా మాజీ ఎంపీ బుట్టారేణుక నిరాడంబరంగా తన నామినేషన్ దాఖలు చేశారు. ఎమ్మిగనూరు ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి, వైఎస్‌ఆర్‌సీపీ కర్నూలు ఎంపీ అభ్యర్థి బీవై రామయ్య వెంట రాగా ఆమె తన నామినేషన్ సమర్పించారు. అలాగే ఎమ్మిగనూరు టీడీపీ అభ్యర్థులుగా బీవీ జయనాగేశ్వరరెడ్డి రెండు సెట్లు, ఆయన భార్య నిత్యారెడ్డి రెండు సెట్ల నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారి చిరంజీవికి అందజేశారు. కోడుమూరు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి వైఎస్‌ఆర్‌సీపీ అభ్యర్థి డాక్టర్ ఆదిమూలపు సతీష్ తరఫున శివశంకర్ అనే వ్యక్తి ఒక సెట్ నామినేషన్‌ను దాఖలుచేశారు. టీడీపీ తరఫున బొగ్గుల దస్తగిరి రెండు సెట్ల నామినేషన్లను వేయగా.. ఆయన వెంట టీడీపీ నియోజకవర్గ మాజీ ఇన్‌చార్జి డి. విష్ణువర్ధన్‌రెడ్డి ఉన్నారు. ఇక కర్నూలు నుంచి ఇద్దరు మూడు సెట్ల నామినేషన్లను దాఖలు చేశారు. ఇందులో అన్నా వైఎస్‌ఆర్ కాంగ్రెస్‌పార్టీ తరఫున గాజుల అబ్దుల్ సత్తార్ రెండు సెట్లు, స్వతంత్ర అభ్యర్థిగా ఖలీల్ అహ్మద్ నామినేషన్ వేశారు. ఆదోనిలో బీఎస్పీ అభ్యర్థి తరఫున ఆసియాబాను అనే మహిళ నామినేషన్‌ను ఆర్‌ఓ శివనారాయణ్ శర్మకు అందజేశారు. ఇక కర్నూలు పార్లమెంట్ నియోజకవర్గం నుంచి టీడీపీ తరఫున ఇద్దరు, స్వతంత్ర అభ్యర్థిగా ఒక్కరు బరిలో నిలిచేందుకు నామినేషన్ వేశారు. ఇందులో టీడీపీ తరఫున ఆ పార్టీ ప్రకటించిన బస్తిపాటి నాగరాజు, ఆయన భార్య కె.జయసుధ నామినేషన్లను దాఖలు చేశారు. టి.బీచుపల్లి అనే వ్యక్తి స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేశారు.

నాలుగు నియోజకవర్గాల్లో నిల్...

సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ఏప్రిల్ 18 నుంచి 25వ తేదీ వరకు నామినేషన్లను స్వీకరిస్తారు. అయితే మొదటిరోజు కర్నూలు పార్లమెంట్‌తో పాటు ఎమ్మిగనూరు, ఆదోని, కర్నూలు, కోడుమూరు నియోజకవర్గాల్లో 11 మంది 15 సెట్ల నామినేషన్లను దాఖలు చేశారు. పాణ్యం, పత్తికొండ, ఆలూరు, మంత్రాలయం నియోజకవర్గాల నుంచి మాత్రం ఒక్క నామినేషన్ దాఖలు కాలేదు. రేపటి నుంచి అన్ని నియోజకవర్గాల్లో నామినేషన్‌లు దాఖలయ్యే అవకాశం ఉంది.

ప్రశాంత వాతావరణంలో..

ప్రశాంత వాతావరణంలో నామినేషన్ల ప్రక్రియ కొనసాగింది. అన్ని ఆర్వో కార్యాలయ దగ్గర మూడంచెల భద్రతను పోలీసులు ఏర్పాటు చేశారు. అభ్యర్థులను ఆర్వో కార్యాలయాలకు 100 మీటర్ల దూరంలోనే నిలిపి లోపలికి పంపారు. ఆర్వో కార్యాలయాల్లోకి అభ్యర్థితోపాటు నలుగురినే అనుమతించారు. కాగా, ఆర్వో కార్యాలయాల్లోకి వెళ్లే ఉద్యోగులను సైతం పోలీసులు గుర్తింపు కార్డులు చూపిన తరువాతే లోపలికి పంపారు.

నేడు ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి నామినేషన్



పత్తికొండ రూరల్: పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి శుక్రవారం నామినేషన్ వేయనున్నారు. కృష్ణగిరి, వెల్దుర్తి, పత్తికొండ, మద్దికెర, తుగ్గలి మండలాల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలి రానున్నారు. ఉదయం 9గంటలకు స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహం నుంచి గుత్తిరోడ్డు కూడలి వరకు పార్టీ నాయకులు, కార్యకర్తలతో ర్యాలీగా నిర్వహించనున్నారు. అక్కడి నుంచి ఆర్డీఓ కార్యాలయానికి చేరుకుని నామినేషన్ దాఖలు చేస్తారని పార్టీ నాయకులు తెలిపారు.

22న ఎమ్మెల్యే కాటసాని నామినేషన్



పాణ్యం: పాణ్యం నియోజకవర్గం నుంచి వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి ఈనెల 22వ తేదీన నామినేషన్ వేయనున్నారు. ఉదయం 9గంటలకు ఎమ్మెల్యే స్వగృహం నుంచి ర్యాలీ ప్రారంభమై కర్నూలులోని కలెక్టరేట్ వరకు సాగుతుంది. పాణ్యం ఈఆర్‌ఓ కార్యాలయంలో నామినేష్ పత్రాలను దాఖలు చేస్తారు. నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఎమ్మెల్యే స్వగృహం వద్దకు చేరుకొని నామినేషన్ కార్యక్రమంలో పాల్గొనాలని పార్టీ నాయకులు కోరారు.

పోస్టల్ బ్యాలెట్‌కు 16,419 దరఖాస్తులు

కర్నూలు(అగ్రికల్చర్): వచ్చే నెల 13న జరిగే సార్వత్రిక ఎన్నికల విధులు నిర్వహించే ఉద్యోగుల్లో 16,419 మంది పోస్టల్ బ్యాలెట్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ కోసం దరఖాస్తు ప్రక్రియ ముగిసింది. దరఖాస్తు చేసుకున్న వారిలో 2,600 మంది ఇతర జిల్లాలు, ఇతర రాష్ట్రాలకు చెందిన ఉద్యోగులు ఉన్నట్లు తెలుస్తోంది. వికలాంగులు, 80 ఏళ్ల పైబడిన వారు హోమ్ ఓటింగ్ కోసం ఈ నెల 22 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. 33 శాఖలను నిత్యావసర సేవల విభాగాలు(ఎసెన్సియల్)గా ఎన్నికల సంఘం గుర్తించింది. ఎన్నికల రోజున వివిధ స్థాయిల్లో విధులు నిర్వహించే ఈ విభాగాల ఉద్యోగులు కూడా హోమ్ ఓటింగ్‌కు దరఖాస్తు చేసుకోవచ్చు. వీరికి ఈ నెల 22 వరకు అవకాశం ఉందని అధికార వర్గాలు తెలిపాయి.

నామినేషన్ కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు

కర్నూలు: నామినేషన్లు వేసే ఆర్‌ఓ కార్యాలయాల వద్ద పటిష్ఠ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. కర్నూలు పార్లమెంట్ నియోజకవర్గానికి కలెక్టర్ కార్యాలయం, పాణ్యం అసెంబ్లీ నియోజకవర్గం నామినేషన్ కేంద్రాన్ని జాయింట్ కలెక్టర్ కార్యాలయం, కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గం నామినేషన్ల కేంద్రాన్ని మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం, కోడుమూరు అసెంబ్లీ నియోజకవర్గం నామినేషన్ కేంద్రాన్ని ఆర్‌డీఓ కార్యాలయ ఆవరణంలో ఏర్పాటు చేశారు. వాటి చుట్టూ 100 మీటర్ల పరిధిలో బారికేడ్లు ఏర్పాటు చేసి పటిష్ఠ భద్రతా బందోబస్తు ఏర్పాటు చేశారు. బారికేడ్లు దాటి లోపలికి ఎవరినీ అనుమతించలేదు. నామినేషన్ దాఖలు చేసే అభ్యర్థులతో పాటు ఐదుగురిని మాత్రమే అనుమతించారు. ఈనెల 25 వరకు నామినేషన్ల ప్రక్రియ కొనసాగనుంది. ఆయా రిటర్నింగ్ కార్యాలయాల వద్ద ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ పత్రాలు స్వీకరించారు. ఉద్యోగులను మినహా లోపలికి ఎవరినీ అనుమతించలేదు. అడిషనల్ ఎస్పీ నాగరాజు కలెక్టరేట్ వద్ద, కర్నూలు డీఎస్పీ విజయశేఖర్ ఆధ్వర్యంలో ఆర్‌డీఓ కార్యాలయం వద్ద ఐదుగురు సీఐలు, పది మంది ఎస్‌ఐలు, స్థానిక పోలీసులతో పాటు కేంద్ర సాయుధ బలగాలను బందోబస్తుకు ఏర్పాటు చేశారు. ఆయా ఆర్‌ఓ కేంద్రాల వద్ద 144 సెక్షన్‌తో పాటు 30 పోలీస్ యాక్ట్‌ను అమలు చేసి భద్రతా చర్యలు చేపట్టారు. ఎస్పీ కృష్ణకాంత్ పర్యవేక్షణలో జిల్లాలోని మిగిలిన ఆర్‌ఓ కేంద్రాల వద్ద కూడా కట్టుదిట్టమైన పోలీసు బందోబస్తుతో భద్రతా చర్యలు చేపట్టారు.

పెరిగిన భగభగలు

- నంద్యాల జిల్లాలో 45 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రతలు



ఎండ వేడిమి నుంచి ఉపశమనం పొందేందుకు తాటి నుంజలను కొనుగోలు చేస్తున్న దృశ్యం

కర్నూలు(అగ్రికల్చర్): ఉమ్మడి కర్నూలు జిల్లాలో భానుడి భగభగలు పెరిగిపోయాయి. వడగాడ్పుల తీవ్రతతో ప్రజలు అల్లాడిపోతున్నారు. గురువారం మంత్రాలయంలో అత్యధికంగా 44.2 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. కర్నూలు జిల్లాలోని ఐదు మండలాల్లో 43 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. కర్నూలులో 44 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. నంద్యాల జిల్లాలో ఎండలు, వడగాడ్పుల తీవ్రత రికార్డు స్థాయికి చేరుతోంది. ఈ జిల్లాలో 8 మండలాల్లో 45 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. బనగానపల్లె, డోన్, రుద్రవరం మండలాల్లో 45.6 డిగ్రీలు, ఆళ్లగడ్డలో 45.4, మిడుతూరులో 45.2 ఆత్మకూరు, బండిఆత్మకూరుల్లో 45.1, గోస్పాడులో 45.0 డిగ్రీల ప్రకారం నమోదయ్యాయి. రానున్న రోజుల్లో ఉష్ణోగ్రతలు 46 నుంచి 48 డిగ్రీల వరకు నమోదయ్యే అవకాశం ఉందని, వడదెబ్బకు గురి కాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని విపత్తుల నిర్వహణ శాఖ అధికారులు సూచిస్తున్నారు.

జూన్ 1న కళాశాలలు పునఃప్రారంభం

నంద్యాల(న్యూటౌన్): జూనియర్ కళాశాలలు జూన్ 1వ తేదీన పునఃప్రారంభం కానున్నాయి. అదే రోజు నుంచి ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు తరగతులు సైతం మొదలుకానున్నాయి. ఈ మేరకు తాజాగా ఇంటర్మీడియెట్ బోర్డు 2024–25 నూతన విద్యా సంవత్సరానికి గాను వార్షిక క్యాలెండర్‌ను, షెడ్యూల్‌ను విడుదల చేసింది. 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి జూనియర్ కళాశాలలు 222 రోజులు పనిచేయనున్నాయి. 2025 మార్చి 31 ఆఖరి పనిదినంగా, ఏప్రిల్ 1 నుంచి 2025 జూన్ ఒకటి వరకు వేసవి సెలవులను ప్రకటించారు. ఈ విద్యా సంవత్సరంలో అక్టోబర్ ఆఖరివారంలో సాంస్కృతిక, నవంబర్ ఆఖరివారంలో స్పోర్ట్స్ వారోత్సవాలను నిర్వహించనున్నారు.

ఒక్కటైన 21 జంటలు



ఆశీర్వాదాలు అందుకుంటున్న నూతన వధూవరులు


కౌతాళం: మదిరె గ్రామంలోని ఉటగనూరు తాత మఠంలో గురువారం 21 జంటలు ఒక్కటయ్యాయి. మఠం ధర్మకర్త పంపారెడ్డి తాత, గ్రామస్తుల ఆధ్వర్యంలో సామూహిక వివాహాలను నిర్వహించారు. ఈ సందర్భంగా పంపారెడ్డి తాత మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ ఏడాది కూడా దాతల సహకారంతో సామూహిక వివాహాలను జరిపించామన్నారు. నూతన వధువరులను వివిధ పార్టీల నేతలు అంక్షితలతో ఆశీర్వదించారు. ఈ జంటలకు దాతలు ఉచితంగా మంగళ సూత్రాలు, కాలిమెట్లను అందించారు.

గడప గడపలో 'అభివృద్ధి'

- గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా వెల్దుర్తి మండలం లక్ష్మీనగరం గ్రామంలో రూ.5 లక్షలతో చిన్న ఖాజా ఇంటి నుంచి కురువ నాగన్న ఇంటి వరకు సీసీ రోడ్డు వేశారు. దీంతో రోడ్డు సమస్య తొలగిపోయింది.
- తుగ్గలి మండలం కడమకుంట్ల గ్రామంలోని వైఎస్సార్ జగనన్న కాలనీలో రూ.10 లక్షలతో రోడ్డును నిర్మించారు. దీంతో జగనన్న కాలనీల్లో గృహాలు నిర్మించుకుంటున్న లబ్ధిదారులు గృహ అవసరాలకు మెటీరియల్‌ను సులభంగా తీసుకువెళ్లేందుకు వీలు ఏర్పడింది.
- ఎమ్మిగనూరు మండలం సోగనూరు గ్రామంలో రూ.18 లక్షలతో పాత జీఎస్‌ఎల్‌ఆర్ నుంచి కొత్త ఎంపీపీ స్కూల్ వరకు, అలాగే బీసీ కాలనీలో సప్పోగు బతుకన్న ఇంటి నుంచి సప్పోగు మనోహర్ ఇంటి వరకు సీసీ రోడ్డు నిర్మించారు. దీంతో ఆ కాలనీలోని ప్రజల ఇబ్బందులు తొలగిపోయాయి.

.. ఇలా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంతో దశాబ్దాల సమస్యలకు పరిష్కారం లభించింది. ఈ కార్యక్రమంలో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను కల్పించేందుకు ప్రభుత్వం ప్రాధాన్యతను ఇస్తోంది.

- ఒక్కో సచివాలయ పరిధిలో రూ.40 లక్షల విలువ చేసే పనులు
- గ్రామాల్లో అంతర్గత రహదారులకు ప్రాధాన్యత
- పీఆర్ ఆధ్వర్యంలో మంజూరైన 1,722 పనుల్లో ఇప్పటికే 668 పనులు పూర్తి
- రూ.77.01 కోట్ల అంచనాతో చేపట్టిన సీసీ రోడ్లు, డ్రైనేజీలు
- సీసీ రోడ్లతో కళకళలాడుతున్న పల్లె వీధులు



తుగ్గలి మండలం శభాష్‌పురం నుంచి డీసీ కొండ గ్రామం వరకు రూ.10 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు



వెల్దుర్తి మండలం లక్ష్మీనగరంలోని వీధిలో వేసిన సీసీ రోడ్డు

కర్నూలు(అర్బన్): గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ప్రతి నియోజకవర్గానికి రూ.2 కోట్లు, ప్రతి సచివాలయ పరిధిలో వివిధ రకాల అభివృద్ధి పనులు చేపట్టేందుకు మొదట రూ.20 లక్షలను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిది. ఈ మొత్తాన్ని రూ.40 లక్షలకు పెంచింది. ప్రతి సచివాలయ పరిధిలో స్థానిక శాసనసభ్యులు కచ్చితంగా పర్యటించి ఆయా ప్రాంతాల్లో నెలకొన్న ప్రజల కనీస అవసరాలు తీర్చేందుకు కార్యాచరణను రూపొందించారు. ఈ నేపథ్యంలోనే పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ శాఖ ఆధ్వర్యంలో మొత్తం 465 గ్రామ సచివాలయాల పరిధిలో రూ. 77.01 కోట్ల అంచనాతో 1,722 పనులను మంజూరు చేసింది. ఆయా సచివాలయాల పరిధిలోని ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని సీసీ రోడ్లు, డ్రైనేజీలు, ఇతరత్రా అభివృద్ధి పనులకు ఒక్కో సచివాలయానికి రూ.40 లక్షల విలువ చేసే పనులను చేపడుతున్నారు. గ్రామ సచివాలయాల పరిధిలో చేస్తున్న పనుతో గతంలో పూర్తి అధ్వానంగా ఉన్న వీధులు నేడు సీసీ రోడ్లతో కళకళలాడుతున్నాయి. గతుకుల రోడ్లలో ఇబ్బందులు పడిన ప్రజలు నేడు సీసీ రోడ్లు వేయడంతో సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు.

పూర్తి అయిన 668 పనులు

జిల్లాలో మొత్తం రూ. 77.01 కోట్ల అంచనాతో 1,722 పనులు మంజూరు కాగా, ఇప్పటి వరకు 668 పనులను పూర్తి చేశారు. మిగిలిన పనులు పురోగతిలో ఉండగా, వివిధ కారణాల వల్ల 126 పనులు ప్రారంభం కాలేదు. ప్రారంభం కాని పనులను కూడా వెంటనే ప్రారంభించేందుకు సంబంధిత అధికారులు చర్యలు చేపట్టారు. చేసిన పనులకు సంబంధించి ఇప్పటి వరకు ప్రభుత్వం దాదాపు రూ.27 కోట్లను విడుదల చేసింది.

స్థానిక అవసరాలకు పెద్ద పీట

గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజల స్థానిక అవసరాలు తీర్చేందుకే ఈ నిధులను వెచ్చించాలని ప్రభుత్వం స్పష్టమైన ఉత్తర్వులు జారీ చేసింది. ముఖ్యంగా తాగునీరు, పారిశుద్ధ్య నిర్వహణ, రోడ్లు, సీసీ డ్రైన్స్ నిర్మాణం తదితర పనులకు ఈ నిధులను ఖర్చు చేయనున్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొనే ఎమ్మెల్యేలకు స్థానిక ప్రజలు తమ ప్రాంత అవసరాలను తీర్చాలని కోరిన వెంటనే సంబంధిత మండల ఇంజినీరు ద్వారా లైన్ ఎస్టిమేట్ వేయించి చేపట్టాల్సిన పనికి సంబంధించిన ప్రస్తుత ఫొటోను జతచేసి సంబంధిత నోడల్ అధికారి (ఎంపీడీఓ) ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేశారు. ఇలా ఆన్‌లైన్‌లో పంపిన వివరాలను ప్రభుత్వం పరిశీలించి ఆయా పనులకు ఆమోదం తెలిపిన వెంటనే ఆయా పనులు చేపట్టేందుకు వీలుగా జిల్లా కలెక్టర్ పాలనా అనుమతులు మంజూరు చేసిన నేపథ్యంలో జిల్లాలోని మెజారిటీ సచివాలయాల పరిధిలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి.

అప్‌లోడ్ చేసిన వెంటనే బిల్లులు

గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం కింద చేపడుతున్న అభివృద్ధి పనులకు ఎలాంటి నిధుల కొరత లేదు. పనులు చేసిన అనంతరం బిల్లులను సీఎఫ్‌ఎంఎస్ పోర్టల్‌లో అప్లోడ్ చేసిన వెంటనే నిధులు విడుదల అవుతున్నాయి. గత ఏడాది రూ.15 కోట్ల వరకు విడుదల కాగా, తాజాగా ఈ ఏడాది మార్చి నెలలో కర్నూలు డివిజన్‌లో 155 పనులకు సంబంధించి రూ.4.91 కోట్లు, ఆదోని డివిజన్‌లో 232 బిల్లులకు గాను రూ.8.84 కోట్లు విడుదలయ్యాయి.

ఎంతో ఉపయోగకరం



గ్రామంలోని వైఎస్సార్ జగనన్న కాలనీ వరకు కొత్తగా రోడ్డు వేయడం వల్ల ఎంతో ఉపయోకరంగా ఉంది. కాలనీలో ఇళ్లు నిర్మించుకునే లబ్ధిదారులు గ్రామం నుంచి సిమెంట్, ఇసుక, స్టీల్ తదితర వాటిని తీసుకుపోయేందుకు ఉన్న ఇబ్బందులు తొలగిపోయాయి. కొత్తగా రోడ్డు నిర్మించడం వల్ల రాకపోకలు బాగా పెరిగాయి.

– ఊటకంటి సునీత, మాజీ సర్పంచు, కడమకుంట్ల

హర్షణీయం



ప్రతి సచివాలయ పరిధిలో ప్రజలకు ఉపయోగపడే అభివృద్ధి పనులు చేపట్టేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రూ.40 లక్షలు కేటాయించడం హర్షణీయం. ఈ నిధులతో గ్రామీణ ప్రాంతాల్లోని అనేక కాలనీల్లో ఉన్న సమస్యలు పరిష్కారమవుతున్నాయి. గడప గడపకు మన ప్రభుత్వం కార్యాక్రమంలో ఎమ్మెల్యే దృష్టికి తీసుకుపోయిన సమస్యలు వెంటనే పరిష్కారానికి నోచుకుంటున్నాయి. ముఖ్యంగా వీధుల్లో సీసీ రోడ్లు వేయడం వల్ల ప్రజలు పడిన ఇబ్బందులు తొలగిపోయాయి.

– అట్లా బసిరెడ్డి, పెండేకల్లు

వాటర్‌షెడ్‌లు... ప్రగతికి బాటలు

- ఉమ్మడి జిల్లాలో రూ.74.88 కోట్లతో 7 ప్రాజెక్టులు
- 34,039 హెక్టార్లలో వాటర్‌షెడ్‌ల అభివృద్ధి
- గ్రామీణాభివృద్ధి కోసం సోలార్‌లైట్ల ఏర్పాటు, పైప్‌లైన్‌ల విస్తరణ
- భూగర్భజలాల అభివృద్ధికి ప్రాధాన్యత
- స్ప్రేయర్లు, ఆయిల్ ఇంజిన్‌లు, టార్పాలిన్ల పంపిణీ



వాటర్‌షెడ్ కార్యక్రమం కింద ఏర్పాటు చేసిన సోలార్ లైట్



రైతులకు టార్పాలిన్లు అందజేస్తున్న జిల్లా కలెక్టర్ డాక్టర్ సృజన (ఫైల్)

కర్నూలు(అగ్రికల్చర్): గ్రామీణాభివృద్ధికి వాటర్‌షెడ్‌లు బాటలు వేస్తున్నాయి. ఉమ్మడి కర్నూలు జిల్లాలో రూ. 74.88 కోట్లతో వాటర్‌షెడ్ కార్యక్రమాలను జిల్లా నీటి యాజమాన్య సంస్థ నిర్వహిస్తోంది. ప్రధానమంత్రి క్రిషి సంచాయ్ యోజన(పీఎంకేఎస్‌వై) డబ్ల్యూడీసీ-2.0 కింద కర్నూలు జిల్లాలో 5, నంద్యాల జిల్లాలో రెండు ప్రాజెక్టులు నిర్వహిస్తున్నారు. కర్నూలు జిల్లా ఆలూరు డబ్ల్యూసీసీ పరిధిలోని హాలహర్వి వాటర్‌షెడ్ ప్రాజెక్టులో 4,638, కందనాతి ప్రాజెక్టులో 4,788, పెద్దహరివాణం ప్రాజెక్టులో 4,950, కర్నూలు డబ్ల్యూసీసీ పరిధిలోని పోతుగల్ ప్రాజెక్టులో 5,000, శకునాల ప్రాజెక్టులో 4,900 హెక్టార్ల ప్రకారం మొత్తం 24,276 హెక్టారలో వాటర్‌షెడ్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. నంద్యాల జిల్లాలోని నంద్యాల డబ్ల్యూసీసీ పరిధిలోని ఎద్దుపెంట వాటర్‌షెడ్ ప్రాజెక్టు పరిధిలో 4,763, ఆకుమల్ల ప్రాజెక్టు పరిధిలో 5,000 హెక్టార్ల ప్రకారం ఉమ్మడి జిల్లాలో 34,039 హెక్టార్లను వాటర్‌షెడ్ కార్యక్రమాల అభివృద్ధి చేస్తుండటం విశేషం. ఒక్కో హెక్టారుకు రూ22 వేల ప్రకారం మొత్తం రూ.74.88 కోట్లతో కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. వాటర్‌షెడ్ కార్యక్రమాలను జిల్లా నీటియాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ అమరనాథరెడ్డి, అదనపు పీడీ మాధవీలత పర్యవేక్షిస్తున్నారు.

జోరుగా అభివృద్ధి పనులు..

☛ వాటర్‌షెడ్ కార్యక్రమాల కింద జోరుగా అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఎంట్రిపాయింట్ యాక్టివిటి కింద 2 శాతం నిధులతో వాటర్‌షెడ్ గ్రామాల్లో సోలార్‌లైట్లు ఏర్పాటు చేస్తున్నారు. తాగునీటికి సంబంధించిన పైప్‌లైన్‌ల విస్తరణ వంటి కార్యక్రమాలు చేపడుతున్నారు. వీటితో పాటు ఉచిత పశువైద్య శిబిరాలు కూడా నిర్వహిస్తున్నారు. వాటర్‌షెడ్ కమిటీల తీర్మానం మేరకు కర్నూలు జిల్లాలోరూ.1.07 కోట్లు, నంద్యాల జిల్లాలో రూ. 42.96 లక్షలతో ఈ కార్యక్రమాలు సాగుతున్నాయి.

☛ సహజ వనరుల యాజమాన్యం (ఎస్‌ఆర్‌ఎం) కింద 47 శాతం నిధులతో భూగర్భ జలాలు అభివృద్ధికి సంబంధించిన పనులు చేపట్టనున్నారు. కర్నూలు జిల్లాలో రూ.25.10 కోట్లు, నంద్యాల జిల్లాలో రూ.10.09 కోట్లు ఖర్చు చేయడానికి కార్యాచరణ ప్రణాళిక రూపొందించారు. ఇందులో ఇప్పటికే కర్నూలు జిల్లాలో రూ. 7.22 కోట్లు, నంద్యాల జిల్లాలో రూ.2.72 కోట్లు ఖర్చు చేశారు. ఈ నిధులతో వాగులు, వంకలకు చెక్‌డ్యామ్‌లు, చెక్ వాళ్లు నిర్మించనున్నారు. పర్క్యులేషన్ ట్యాంకులు, అమృత్ సరోవర్‌లు, ఫాంపాండ్లు, డగౌటు పాండ్స్ వంటి పనులు చేపట్టారు.

☛ వాటర్‌షెడ్ నిధులతో వ్యవసాయ ఉత్పాదకత పెంపు(పీఎస్‌ఐ) కోసం మొత్తం నిధుల్లో 15 శాతం ఖర్చు చేయాల్సి ఉంది. ఈ ప్రకారం కర్నూలు జిల్లాలో రూ.8.01 కోట్లు, నంద్యాల జిల్లాలో రూ.3.22 కోట్లు వినియోగిస్తున్నారు. ఇప్పటి వరకు కర్నూలు జిల్లాలో రూ.3.42 కోట్లు,నంద్యాల జిల్లాలో రూ.3.22 కోట్లు ఖర్చు చేశారు. వ్యవసాయ ఉత్పాదకత పెంపుకోసం స్ప్రేయర్లు, ఆయిల్ ఇంజిన్లు, టార్పాలిన్‌లు వంటి రైతులకు పంపిణీ చేశారు. వాటర్‌షెడ్ కార్యక్రమాలు మరో రెండేళ్లు జరుగుతాయి.

క్లుప్తంగా

22న సీనియర్ సాఫ్ట్‌బాల్ ఎంపిక పోటీలు

కర్నూలు (టౌన్): కర్నూలు క్లబ్ కోర్టులో జిల్లా స్థాయి సీనియర్ సాఫ్ట్‌బాల్ టెన్నిస్ బాలురు, బాలికల జట్లకు ఎంపిక పోటీలు ఈనెల 22వ తేదీన నిర్వహిస్తున్నట్లు జిల్లా సంఘం ప్రధాన కార్యదర్శి నవీన్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన జట్లు ఈనెల 29 నుంచి 30 వరకు కర్నూలులో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి సీనియర్ సాఫ్ట్ టెన్నిస్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొంటాయని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు తమ వెంట వయస్సు ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు జిరాక్స్ కాపీతో పాటు నాలుగు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో హాజరు కావాలని తెలిపారు. వివరాలకు 9642587333 సెల్ నంబర్‌ను సంప్రదించాలన్నారు.

మే 5న జిల్లా స్థాయి క్యారమ్స్ పోటీలు

కర్నూలు కల్చరల్: కర్నూలు యునైటెడ్ క్లబ్ ఆధ్వర్యంలో మే 5వ తేదీన జిల్లా స్థాయి క్యారమ్స్ పోటీలు నిర్వహిస్తున్నట్లు క్లబ్ గేమ్స్ సెక్రటరీ, జిల్లా క్యారమ్స్ జనరల్ సెక్రటరీ ఎస్.చెన్నకేశ రాజు తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు మే 15వ తేదీలోగా పేర్లు నమోదు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. డబుల్స్ విన్నర్స్‌కు రూ.8,116, సింగిల్స్ విన్నర్స్‌కు రూ.6,116, డబుల్స్ రన్నర్స్‌కు రూ.6,116, సింగిల్స్ రన్నర్స్‌కు రూ.4,116 నగదు బహుతులు ఉంటాయని తెలిపారు. మరిన్ని వివరాలకు, రిజిస్ట్రేషన్‌కు 94402 37741, 81794 27741 నంబర్లను సంప్రదించాలని కోరారు.

మధ్యాహ్నం సమయంలో విద్యుత్ పోల్స్ ఎక్కొద్దు

కర్నూలు(అగ్రికల్చర్): ఉమ్మడి జిల్లాలో ఎండల తీవ్రత అధికమైందని, మధ్యాహ్నం 11 నుంచి 4 గంటల మధ్య సిబ్బంది విద్యుత్ పోల్స్ ఎక్కవద్దని ఎస్ఈ ఎం.ఉమాపతి తెలిపారు. ఎండలు, వడగాడ్పుల తీవ్రత నేపథ్యంలో గురువారం ఆయన విద్యుత్ భవన్ నుంచి ఈఈలు, డీఈ, ఏడీఈలతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ. ఉదయం 6 నుంచి 11 గంటల వరకు, సాయంత్రం 5 గంటల తర్వాతనే మెయింటెనెన్స్ పనులు చేపట్టాలని సూచించారు. ఎండల తీవ్రతకు ట్రాన్స్‌ఫార్మర్లు పేలే ప్రమాదం ఉందని, అన్ని కేడర్ల విద్యుత్ సిబ్బంది తాము పనిచేసే హెడ్‌క్వార్టర్స్‌లోనే ఉండాలన్నారు. ఇటీవల గూడూరులో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ పేలితే సిబ్బంది అక్కడే ఉండటం వల్ల వెంటనే తగిన చర్యలు తీసుకోవడంతో విద్యుత్ సరఫరాకు ఆటంకం కలుగలేదన్నారు.

క్వారీలో అక్రమ తవ్వకాలు



క్వారీని తనిఖీచేస్తున్న జిల్లా మైనింగ్ అధికారులు

కర్నూలు (న్యూటౌన్): అనుమతులు లేకుండా క్వారీలో అక్రమంగా తవ్వకాలు జరుపుతున్నట్లు తనిఖీల్లో తేలిందని జిల్లా మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ టి రాజశేఖర్ గురువారం విలేకరులకు తెలిపారు. కర్నూలు మండలం పూడూరు గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 48/1లో క్వారీ లీజుదారుడు తనకు కేటాయించిన విస్తీర్ణం కంటే అర్ధ ఎకరా ఎక్కువ విస్తీర్ణంలో తవ్వకాలు చేసినట్లు సర్వేలో తేలిందన్నారు. దీంతో సంజాయిషీకి డిమాండ్ నోటీసులు జారీ చేసినట్లు చెప్పారు. తనిఖీల్లో సర్వేలో సర్వేయర్ మాధవి, రాయల్టీ ఇన్‌స్పెక్టర్ మురహరి,టెక్నికల్ అసిస్టెంట్ దిలీప్ పాల్గొన్నారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి



మృతుడు బంగారప్ప (ఫైల్)

ఆదోని అర్బన్: పట్టణ శివారులోని బసవేశ్వర సర్కిల్ సమీపంలో బంగారప్ప(42) అనే వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. త్రీటౌన్ సీఐ నరసింహరాజు తెలిపిన వివరాల మేరకు.. పది రోజుల క్రితం బంగారప్ప, భార్య గిరిజమ్మ గొడవ పడ్డారు. వెంటనే బంగారప్ప భార్య, కుమారులు బెంగళూరుకు వెళ్లిపోయారు. పది రోజుల నుంచి తండ్రి నుంచి ఫోన్ రాకపోవడంతో కుమారుడు రాఘవేంద్ర ఆదోని పట్టణంలోని బసవేశ్వర సర్కిల్ సమీపంలోని స్వగృహానికి వెళ్లి చూడగా తండ్రి మృతదేహం కనిపించింది. బంగారప్ప మృతదేహం కుళ్లిపోయి పురుగులు పడిందని, పోస్టుమార్టం నిమిత్తం ఆదోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు సీఐ తెలియజేశారు. మృతుని కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానస్పద స్థితిలో మృతి చెందినట్లు కేసు నమోదు చేశామని చెప్పారు.

యువకుడి ఆత్మహత్య



మృతుడు చిన్న హుస్సేన్ (ఫైల్)

బేతంచెర్ల: పట్టణంలోని సంజీవనగర్ కాలనీకి చెందిన ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికంగా నివాసముంటున్న దూదేకుల పెద్ద హుస్సేన్, షేకూన్‌బీ దంపతులకు ముగ్గురు కుమారులు ఉన్నారు. చిన్న కుమారుడు చిన్న హుస్సేన్ (20) ఓ ప్రైవేట్ ఎలక్ట్రానిక్స్ షాపులో పని చేస్తున్నాడు. కొంత కాలంగా మానసిక స్థితి సరిగా లేదు. ఈ క్రమంలో గురువారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుమారుడి మృతితో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

నాటుసారా స్థావరాలపై దాడి



బెల్లం ఊటను ధ్వంసం చేస్తున్న సెబ్ సిబ్బంది

కర్నూలు:ఓర్వకల్లు పరిసరాల్లోని నాటుసారా స్థావరాలపై సెబ్ పోలీసులు దాడులు నిర్వహించారు. కర్నూలు సెబ్ స్టేషన్ ఎస్ఐ రెహనా బేగం ఆధ్వర్యంలో గురువారం నాటుసారా స్థావరాలపై దాడులు నిర్వహించి సుమారు 1800 లీటర్ల నాటుసారా ఊటను ధ్వంసం చేశారు. సారా తయారీకి ఉపయోగించే సామగ్రి డ్రమ్ములు, పాత్రలు స్వాధీనం చేసుకుని 15 లీటర్ల సారాను సీజ్ చేసి ఓర్వకల్లు గ్రామానికి చెందిన షికారి వసంత్‌ను అరెస్టు చేసినట్లు సీఐ రాజేంద్రప్రసాద్ తెలిపారు.

ఎమ్మెల్యే చొరవతో పై చదువులు చదువుతున్నా



విద్యార్థిని నిర్మలను అభినందిస్తున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి, పక్కనే కర్నూలు ఎంపీ అభ్యర్థి బీవై రామయ్య

- 'గడప గడపకు మన ప్రభుత్వం' నా జీవితాన్ని మలుపు తిప్పింది
- సీఎంకు, ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలియజేసిన విద్యార్థిని నిర్మల

ఆదోని రూరల్: ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి చొరవతోనే తాను పై చదువులు అభ్యసిస్తున్నానని, గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం తన జీవితాన్ని మలుపుతిప్పిందని విద్యార్థిని నిర్మల తెలిపారు. గురువారం విద్యార్థిని నిర్మల, తల్లి హనుమంతమ్మ, గ్రామపెద్దలు, వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి ఎమ్మెల్యే స్వగృహానికి వచ్చారు. అక్కడున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ కర్నూలు ఎంపీ అభ్యర్థి బీవై రామయ్య కు విద్యార్థి నిర్మల కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా విద్యార్థిని నిర్మలకు శాలువా కప్పి సన్మానించారు. అనంతరం విద్యార్థిని మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం పెట్టడం వల్లే ఎమ్మెల్యే, ఆయాశాఖల అధికారులు తమ గడపకు వచ్చారన్నారు.'నన్ను చూసిన ఎమ్మెల్యే ఏమి చేస్తున్నావు అని అడగడంతో నేను మా ఊరిలోని జెడ్పీ పాఠశాలలో పదో తరగతి వరకు చదువుకున్నానని, నాకు పదో తరగతిలో 537 మార్కులు వచ్చాయని, పై చదువులు చదువుకోవాలన్న ఆసక్తి ఉన్నప్పటికీ ఆర్థిక స్తోమత లేక అమ్మ నన్ను కూలీ పనులకు తీసుకెళ్తుందని' చెప్పానన్నారు. స్పందించిన ఎమ్మెల్యే అధికారులతో మాట్లాడి చదువుకు సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారన్నారు. ఈ విషయాలు దినపత్రికల్లో ప్రచురితం కావడంతో జిల్లా కలెక్టర్ సృజన కలెక్ట ర్ కార్యాలయానికి పిలిపించి ఆస్పరి కస్తూర్బా పాఠశాలలో చేర్పించారన్నారు. ప్రస్తుతం వెలువడిన ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం బైపీసీలో 421/440 మార్కులు సాధించానన్నారు. బాగా చదువుకుని ఐపీఎస్ ఆఫీసర్‌ను కావాలనేది తన లక్ష్యమని పేర్కొన్నా రు. ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ.. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా నిర్మల ఇంటికి వెళ్లడం వల్లనే ఇలాంటి పేద విద్యార్థుల ప్రతిభ వెలుగులోకి వచ్చిందన్నారు. మంచి ఉద్దేశంతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఈ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారన్నారు. చదువుకోవాలన్న ఆకాంక్ష ఉన్నప్పటికీ పేదరికం అడ్డురావడంతో కొందరు విద్యార్థులు ఆగిపోతున్నారని, వారికి తనవంతుగా సహాయ సహకారాలు అందిస్తానని భరోసా ఇచ్చారు.

టీడీపీ ఎంపీ అభ్యర్థి బస్తిపాటి నాగరాజు కోటీశ్వరుడే..

కర్నూలు(సెంట్రల్): కర్నూలు టీడీపీ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న బస్తిపాటి నాగరాజు కోట్లకు అధిపతి. ఆయన, ఆయన భార్య కె.జయసుధకు కలిపి ఏకంగా రూ.8,54,79,900 స్థిర, చరాస్తులు ఉన్నాయి. గురువారం కర్నూలు టీడీపీ ఎంపీ అభ్యర్థిగా నాగరాజు, ఆయనకు డమ్మీగా భార్య జయసుధ నామినేషన్లను దాఖలు చేశారు. ఇందులో వారు సమర్పించిన అఫిడవిట్‌లో చర, స్థిరాస్తుల వివరాలను ప్రకటించారు.

బొగ్గుల దస్తగిరి చేతిలో నగదు రూ.10 వేలేనంట!

కోడుమూరు అసెంబ్లీ టీడీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న బొగ్గుల దస్తగిరిచేతిలో ఉండే నగదు కేవలం రూ.10 వేలే నంట. ఆయన భార్య ఎం.సుధారాణి చేతిలో కూడా మరో రూ.20 వేలు ఉన్నట్లు గురువారం ఎన్నికల కమిషన్‌కు సమర్పించిన అఫిడవిట్‌లో చూపించారు.అయితే ఆయనకు చరాస్తులు రూ.14.74లక్షలు, భార్యకు రూ.7.60 లక్షలు ఉన్నట్లు పేర్కొన్నారు.

అతివేగానికి ఇద్దరు బలి



ప్రమాదానికి కారణమైన బస్సు



మృతి చెందిన శ్రీనివాసులు, రాము

- కల్వర్టును ఢీ కొట్టిన ప్రైవేట్ ట్రావెల్‌బస్సు
- పూడిచెర్ల వద్ద చోటుచేసుకున్న ఘటన

ఓర్వకల్లు: అతివేగం, డ్రైవర్ నిర్లక్ష్యంతో ఇద్దరు మృత్యువాత పడ్డారు. ప్రైవేట్ ట్రావెల్ బస్సు కల్వర్టును ఢీ కొనడంతో ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. తిరుపతి నగరానికి చెందిన శ్రీకార్తీక్ ట్రావెల్స్ అనే ప్రైవేట్ బస్సు 25 మంది ప్రయాణికలతో హైదరాబాద్‌కు బయలుదేరింది. ఉదయం తెల్లవారుజామున ఓర్వకల్లు మండలం పూడిచెర్ల బస్సు స్టేజీ వద్దకు రాగానే డ్రైవర్ నిర్లక్ష్యం, అతివేగం కారణంగా బస్సు కల్వర్టును ఢీ కొట్టింది. ప్రమాదంలో బస్సు డ్రైవర్ పుత్తూరుకు చెందిన శ్రీనివాసులు(52), రాజంపేటకు చెందిన మరో ప్రయాణికుడు రాము(45) అక్కడికక్కడే మృతి చెందారు. బస్సులో ఉన్న మరో నలుగురు స్వల్పంగా గాయపడ్డారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులను హైవే పెట్రోలింగ్ వాహనంలో కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తిరుపతికి చెందిన అదే బస్సు డ్రైవర్ సోమశేఖరరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజారెడ్డి పేర్కొన్నారు. బస్సు కల్వర్టును ఢీ కొట్టి పల్టీకొట్టకుండా అక్కడే ఆగిపోవడంతో పెను ప్రమాదం తప్పినట్లు పోలీసులు భావిస్తున్నారు.

అభివృద్ధికి పట్టం కట్టండి

- డోన్‌లో ఇంటింటి ప్రచారంలో బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి
- హారతులు పట్టిన మహిళలు



నా ఓటు అభివృద్ధికే అంటూ మంత్రికి చెబుతున్న వృద్ధుడు



కూరగాయల మార్కెట్‌లో మంత్రితో కరచాలనం చేస్తున్న వ్యాపారస్తురాలు

డోన్: సార్వత్రిక ఎన్నికల్లో అభివృద్ధికి పట్టం కట్టి అరాచక శక్తులను చిత్తుగా ఓడించాలని డోన్ ప్రజలకు రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి పిలుపునిచ్చారు. నియోజకవర్గ కేంద్రం డోన్ 30, 31, 19, 20 వ వార్డుల్లో గురువారం మంత్రి ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా పలు కాలనీల్లో ముఖ్యంగా మహిళలు బుగ్గనకు మంగళహారతులు పట్టి పెద్దఎత్తున స్వాగతం పలికారు. యువకులు, స్థానికులు గజమాలలతో సత్కరించారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో అభ్యర్థులను అఖండ మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు. డోన్ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కోట్ల సూర్య స్థానికుడు కాదని మంత్రి బుగ్గన పేర్కొన్నారు. కోట్లకు కనీసం డోన్‌లో స్థిర నివాసం, ఓటు హక్కు కూడా లేవన్నారు. 2009 ఎన్నికల్లో ఓటమి తర్వాత చెప్పా, చేయకుండా నియోజకవర్గ ప్రజలను వదిలి ఎక్కడికి వెళ్లారో చెప్పాలని డిమాండ్ చేశారు. 50 ఏళ్లకుపైగా హత్యారాజకీయాలు చేసిన వారిని ప్రజలు ఎలా నమ్ముతారన్నారు. అభివృద్ధి పట్ల చిత్తశుద్ధి లేని నాయకులు ఏ మొహం పెట్టుకొని ఓట్లు అడుగుతున్నారన్నారు.

ఓటర్లూ.. తస్మాత్ జాగ్రత్త

15 ఏళ్లగా ప్రశాంతంగా జీవిస్తున్న నియోజకవర్గ ప్రజల జీవితాలతో ఆటలాడుకునేందుకు ఎన్నికల నెపంతో వర్గాలుగా చీల్చేందుకు కోట్ల, కేఈ కుటుంబాలు మళ్లీ ఒక్కటయ్యాయని బుగ్గన విమర్శించారు. వీరిపట్ల ప్రజలు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. మంత్రి వెంట రాష్ట్ర మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు, మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్, వైస్ చైర్మన్ జాకీర్‌హుసేన్, కౌన్సిలర్లు పాలుట్ల మీనాక్షి, మేకల విమల, ఆర్ట్ రమణ, వెంకట్రాముడు, సుంకన్న, రవిరెడ్డి, వెంకటేశ్వరమ్మ, శివలక్ష్మి, దినేష్ గౌడ్, మల్లికార్జునరెడ్డి, రైల్వే నాగేంద్ర, బోయ కళావతి, సుమలత సురేష్ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

■ మాతృ భాష తెలుగులో పట్టులేని విద్యార్థులకు సమ్మర్లో 45 రోజుల్లో వ్రాయడం, చదవడం నేర్పబడును. కర్నూలు & ఎమ్మిగనూరు బ్రాంచ్‌లలో. సం.ప్ర: 93980 02518. [L-800565]

SPOKEN ENGLISH

■ SHAKESPEARE SPOKEN ENGLISH సమ్మర్లో 45 రోజుల కోచింగ్ కర్నూలు & ఎమ్మిగనూరు బ్రాంచ్‌లలో ప్రారంభం. సం.ప్ర: 99859 23345. [L-800564]

REAL ESTATE

PLOT FOR SALE

■ కర్నూలు-డోన్ రోడ్, రిడ్జ్ స్కూల్‌కు దగ్గరలో అన్ని డెవలప్‌మెంట్స్ గల వెంచర్ నందు ఓపెన్ ప్లాట్లు మరియు ఇండిపెండెంట్ హౌసెస్ తక్కువ ధరకు కలవు. ఫోన్ 98852 66558. [L-794386]

TO - LET

■ కర్నూలు N.R.పేట, బాలాజి నర్సింగ్ హోమ్ ఎదురుగా, క్రిష్ణ స్క్వేర్, #43/6/d నందు గ్రౌండ్ ఫ్లోర్ మరియు 1వ ఫ్లోర్‌లో షాపులు అద్దెకు కలవు. సెల్: 99080 49901. [L-794384]

SERVICES

బంగారం కొనబడును

■ మీ పాత బంగారాన్ని కొనబడును. & తాకట్టులో గాని, బ్యాంకులో గాని ఉన్న బంగారాన్ని విడిపించి మార్కెట్ రేటుకు కొనబడును. సంప్ర: 94949 41678. [L-429]

■ మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్ / ఫైనాన్స్‌లో తాకట్టులో ఉన్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును స్పాట్ క్యాష్ / షిఫ్టింగ్ (రిటైర్డ్ పోలీస్ డిపార్ట్‌మెంట్) గోల్డ్‌ట్రేడింగ్ కం. ఫోన్: 73821 14647 [V-6467]

జ్యోతిష్యం

■ కాళీమాత ఉపాసకులు మంత్ర, యంత్ర, తంత్ర, ఎటువంటి సమస్యలకైనా శాశ్వత పరిష్కారం చూపబడును. సంప్రదించండి. అజయ్ శర్మ గురూజీ ✆ 98495 24118 [B-1197443]

WANTED

■ కర్నూలు నగరంలో ప్రముఖ రియల్ ఎస్టేట్ కంపెనీకి మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. Salary+Attractive ఇన్సెంటివ్స్. సం.ప్ర: సెల్: 88834 87333. [L-06]

■ జైదేవ్ గ్రూప్ ఆఫ్ సర్వీసెస్: నంద్యాలలో పనిచేయుటకు టెలికాలర్స్ కావలెను. జీతం: 10,000/- to 15,000/-, విద్యార్హత: 10th-డిగ్రీ. సెల్: 8897872948, 9542412251. [L-794387]

■ కర్నూలులో ప్రముఖ వాటర్ ప్లాంట్ నందు పనిచేయుటకు APE ఆటో 3 వీలర్ డ్రైవర్ మరియు BOLERO 4 వీలర్ డ్రైవర్ కావలెను. డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరి. సం.ప్ర: 7013379537, 9100782029. [L-794389]

■ Wanted qualified and well experienced teachers to teach all subjects for Pre Primary, Primary and Higher Classes. St Lourdes EM School. Cell: 94939 02958. [L-800563]

■ మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్ ద్వారా మా కంపెనీ యొక్క Message పంపుతూ వారానికి 3500/- సంపాదించుకోండి. వాట్సాప్ చేయండి. సం.ప్ర: 9985193111,9573633520. [M-1233964]

■ కిసాన్ సర్వే ఫీల్డ్ వర్క్ చేయుటకు జిల్లా వ్యాప్తంగా ఎంప్లాయిస్ కావలెను. Q: 10th / ఇంటర్. జీతం : 18వేలు + 2వేలు TA, DA. సెల్ : 90325 46599. [A-1225]

■ బంగారు లక్ష్మి గోల్డ్ & ప్రాపర్టీస్ ప్రై.లి. కంపెనీలో పనిచేయుటకు ఆఫీస్ స్టాఫ్ కావలెను. Qly: 10th to Degree, Cont: శ్రీకాంత్‌రెడ్డి ✆ 83415 64750. [B-1197442]

■ కష్టపడేవాళ్ళు కాదు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు ఆయా, నర్సులు, వంటవాళ్ళు, RMP & డాక్టర్స్ కావలెను. జీ: 15000 - 40,000, ఫ్రీ రూమ్+భోజనం, Hyd. Ph: 8317512135 [HA-37]

■ మర్చంట్ నేవీలో ఖాళీలు పురుషుల కోసం డైరెక్ట్ షిప్పింగ్ కంపెనీ ఖాళీలు. విభాగం: ఇంజిన్, డెక్, కుక్. వయసు : 18-28. అర్హత:10వ తరగతి ఉత్తీర్ణత & అంతకంటే ఎక్కువ. Makira Marine Services Pvt. Ltd. Hyderabad (Telangana), Palakkad (Kerala) Ph: 6238686422. [H-778903]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.



దళితులకు వైఎస్సార్‌సీపీ అండ

- దళితులను 'మామ' అని పిలవడానికి ఆనందిస్తానన్న సీఎం వైఎస్ జగన్
- చంద్రబాబు హయాంలో ఫిర్యాదు చేయాలంటేనే హడల్
- ఎస్సీ, ఎస్టీ కేసుల దర్యాప్తులో ముందడుగు
- ఈనాడు రోత రాతలపై భగ్గుమన్న నేతలు, మేధావులు

కర్నూలు(అర్బన్): దళితుల్లో పుట్టాలని ఎవరైనా కోరుకుంటారా ? అని సాక్షాత్తు మాజీ ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత చంద్రబాబు నోటి నుంచి వచ్చిన మాటలను దళిత జాతి ఎన్నటికీ మరచిపోదు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ దళితులను ' మామ ' అని పిలవడంలోనే ఎంతో ఆనందం ఉందనడాన్ని చూస్తే దళితుల పట్ల ఆయకున్న ప్రేమ, అభిమానాలు అర్థమవుతున్నాయి. తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ఎస్సీ, ఎస్టీలపై దాడులు జరిగినా, ధైర్యంగా ఫిర్యాదు చేసే పరిస్థితులు అప్పట్లో లేవనే విషయం తెలిసిందే. దళిత, గిరిజన వర్గాలపై దాడులు, వేధింపులకు పాల్పడిన వారి పట్ల వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చాలా కఠినంగా వ్యవహరిస్తోంది. ఆధారాల సేకరణ కోసం వీడియో కాన్ఫరెన్స్ విధానాన్ని దేశంలో తొలిసారిగా 2020 ఆగస్టులో ప్రవేశపెట్టిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కుతుంది. ఎస్సీ, ఎస్టీ కేసుల దర్యాప్తులోను రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న వేగవంతమైన చర్యల వల్ల మెరుగైన ఫలితాలు వస్తున్నాయి. టీడీపీ పాలనలో 2014 నుంచి 2019 వరకు చూస్తే దర్యాప్తు చేసేందుకు సగటున 206 రోజులు పడితే, ప్రస్తుత ప్రభుత్వంలో 86 రోజులకు తగ్గింది. దళితుల అభివృద్ధికి సంబంధించి ప్రత్యేకంగా కార్పొరేషన్లు ఏర్పాటు చేసి వారి ఉన్నతి కోసం కృషి చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చేతులకు ' దళితుల రక్తపు మరక 'లను అంటించిన ఈనాడు పత్రికపై దళిత వర్గాలు తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తున్నాయి.

దళితుల ద్రోహి చంద్రబాబు



చంద్రబాబు దళితుల ద్రోహిగా ముద్ర పడ్డాడు. ఆయనకు దళిత, గిరిజనులంటే చాలా చిన్న చూపు. టీడీపీ పాలనలో దళితుల అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అనే సామెతలా ఉండేది. వైఎస్ జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక, దేశ చరిత్రలో లేని విధంగా దళిత వర్గాలకు చెందిన నలుగురు కేబినేట్ మంత్రులుగా, వారిలో ఒకరు ఉప ముఖ్యమంత్రి, మరొకరు హోం శాఖా మంత్రిగా విధులు నిర్వహిస్తున్నారు. ఊహించని విధంగా ఎంతో మందికి నామినేటెడ్ పదవులు అందాయి. ఇక రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టి అమలు చేస్తున్న అన్ని సంక్షేమ పథకాలు దళితులకు అందుతున్నాయి.

– సీహెచ్ మద్దయ్య, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి

కారంచేడు, గరగపర్రును ఇంకా ఎవరూ మరువలేదు



తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో జరిగిన కారంచేడు, గరగపర్రు సంఘటనలు ఇంకా రాష్ట్రంలోని దళితులు మరచిపోలేదు. అగిరిపల్లిలో దళిత యువకులపై అక్రమ కేసులు, రావూరులో దళితులపై దాడులు, దేవరపల్లిలో దళితుల భూముల కబ్జాలు టీడీపీ పాలనలోనే జరిగాయి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో దళితుల ఐక్యత, ఆత్మగౌరవం, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టడం తెలుగుదేశం నేతలకు ఇష్టం లేదు. విభజన రాజకీయాలు వారికి వెన్నతో పెట్టిన విద్య. గ్రామ సచివాలయాల ద్వారా మధ్యవర్తుల ప్రమేయం, నయాపైసా లంచం ఇవ్వకుండా అత్యధికంగా లబ్ధి పొందుతున్నది దళితులే అనే విషయాన్ని గుర్తించుకోవాలి.

– కాసారపు వెంకటేష్, మాల విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు

ఎస్సీ వర్గీకరణలో మోసం చేసిన చంద్రబాబు



ఎస్సీ వర్గీకరణకు సంబంధించి చంద్రబాబు మాదిగలను పూర్తి స్థాయిలో మోసం చేశారు. దళితుల ఎదుగుదలను ఓర్వలేని నాయకుడు చంద్రబాబు.రాష్ట్రంలో వైఎస్ జగన్ ముఖ్యమంత్రి అయ్యాకే దళితుల ఆత్మగౌరవం పెరిగింది.రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకే దాడులు, వేధింపుల కేసుల్లో బాధితులైన దళితులకు మెరుగైన పరిహారం అందుతోంది. టీడీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన దాడులకు సంబంధించిన పరిహారం కూడా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పంపిణీ జరిగింది. దళిత వర్గాల పట్ల వైఎస్ జగన్ చూపిస్తున్న ఆదరణను చూసి ఓర్వలేక అక్కసుతో ఈనాడులో బరితెగించి తప్పుడు కథనాలను రాయిస్తున్నారు.

– జోలాపురం రవి మాదిగ, రాష్ట్ర ఉపాధ్యక్షులు, నవ్యాంధ్ర ఎంఆర్‌పీఎస్

'అపర్ణ' మేనేజర్‌కు అరెస్టు వారెంట్

కర్నూలు (లీగల్): తమ ఆదేశాలను అమలు చేయని అపర్ణ ఆటోమొబైల్స్‌పై జిల్లా వినియోగదారుల కమిషన్ ఆగ్రహం వ్యక్తం చేసింది. నెలలు గడచినా ఆదేశాలు అమలు చేయకపోవడంతో మేనేజర్‌కు కమిషన్ అధ్యక్షులు కె.కిషోర్ కుమార్, సభ్యులు నారాయణరెడ్డి, నజీమా కౌసర్‌లతో కూడిన బెంచ్ గురువారం అరెస్టు వారెంటు (ఎన్‌బీడబ్ల్యూ) జారీ చేసింది. కర్నూలుకు చెందిన ఎస్.అభిషేక్ తన టీవీఎస్ అపాచీ ఆర్‌ఆర్-310 బైక్‌ను గత ఏడాది ఏప్రిల్ 21న అపర్ణ ఆటోమొబైల్స్‌లో మొదటి సర్వీసింగ్‌కు ఇచ్చారు. ఇందుకు సంబంధించిన ఫీజును అభిషేక్ చెల్లించారు. అయితే సర్వీసింగ్ అనంతరం మెకానిక్ టెస్ట్ రైడ్ చేస్తున్న సమయంలో బైక్‌కు యాక్సిడెంట్ జరిగింది. దీంతో 15 వాహన పార్ట్స్‌ను మార్చామని, వాహనం తీసుకెళ్లాలని ఆటోమొబైల్ నిర్వాహకులు తెలిపారు. టెస్ట్ రైడ్‌లో నిర్లక్ష్యంగా వాహనం నడపటం వల్లే ప్రమాదం జరిగిందని, 15 పార్ట్స్ మార్చిన వాహనం తనకు వద్దని, భవిష్యత్తులో మరమ్మతులు చేయించాల్సి రావచ్చంటూ కొత్త వాహనం ఇవ్వాలని కోరారు. ఇందుకు ఆటోమొబైల్ నిర్వాహకులు నిరాకరించడంతో జిల్లా వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించారు. తన కేసును తానే వాదించుకున్నారు. అన్ని అంశాలను పరిశీలించిన కమిషన్... అపర్ణ ఆటోమొబైల్స్ నిర్వాహకుల నిర్లక్ష్యం కారణంగానే ప్రమాదం జరిగిందని, పిటిషనర్‌కు కొత్త టీవీఎస్ అపాచీ ఆర్‌ఆర్-310 వాహనం ఇవ్వాలని, అలాగే మానసిక వేదనకు గురిచేసినందుకు రూ.50 వేలు, కోర్టు ఖర్చులకు రూ.10 వేలు 45 రోజుల్లో చెల్లించాలని గత ఏడాది డిసెంబర్ 27న ఆదేశించింది. 90 రోజులు దాటినా కమిషన్ తీర్పు అమలు చేయకపోవడంతో అభిషేక్ మరోసారి కమిషన్‌ను ఆశ్రయించారు.